ఈ వారం తెలుగు పుస్తకం

శివసాగర్ కవిత్వం - నిర్వహణ పద్ధతులు

పెన్నా శివరామకృష్ణ



Author: SIVASAGAR
Subject: MODERN POETRY
Year of Publication: 2004
Price: USD $ 2.31

"In Such men as Ho Chi Minh, the intelligence and sensibility are one. There is nothing secret in his public and private life. To him the sight of suffering is a call both to action and to poetical expression"

- *Phan Nhuan*

- (from preface "*The prison diary of Hochi Minh*" P. xxii).

అంతర్జాతీయ విముక్తి పోరాటాలతో భావైక్యాన్ని ప్రకటించి, ప్రాంతీయ విప్లవాత్మ భౌతిక పరిస్థితులను పాటలలోను, వచన కవిత్వంలోను ప్రతిభావంతంగా చిత్రించిన కవి శివసాగర్.

గెరిల్లా విప్లవగీతాలు (1972), జనం ఊపిరితో (1983), పదివసంతాలు (1983) అనే శివసాగర్ సంకలనాలన్నీ కలిపి 1983 లో 'ఉద్యమం నెల బాలుడు'గా ప్రచురింపబడింది. ఉద్యమం నెలబాలుడు (1983), నెలవంక (1988) కవితా సంకలనాలతో పాటు ఆ తర్వాత రాసిన కవితలను 'నడుస్తున్న చరిత్ర' పేరుతో జతచేసి 'శివసాగర్ కవిత్వం' పేరుతో (సెప్టెంబర్, 2004) స్వేచ్ఛ ప్రచురణలు - ఖమ్మం వారు ప్రచురించారు. ఈ తాజా సంకలనంలోని కవితలను చదువుతున్నప్పుడు ఈ కవిత్వం నేటికీ ఇంతటి ఉత్తేజాన్ని ఎందుకు కలిగిస్తున్నది? కవిత్వానుభవాన్ని ఎందుకు ఇస్తున్నది? అని పాఠకునిగా నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఆ ప్రశ్నలకు జవాబులుగా నాకు తోచిన కొన్ని అంశాలను పాఠకులతో పంచుకోవాలనే ఈ ప్రయత్నం. ఇంతకు ముందే విజ్ఞులైన విమర్శకులు (చేకూరి రామారావు, వరవరావు, డా.కె.రామదాసు, గుడిపాటి మొదలైనవారు) శివసాగర్ కవిత్వంలోని వస్తు రూపాల విశిష్టతను విశ్లేషించారు. చర్విత చర్వణమవుతుందన్న ఉద్దేశంతో వారు చర్చించిన అంశాలను నేనిక్కడ ప్రస్తావించడం లేదు. ప్రధానంగా శివసాగర్ కవిత్వనిర్వహణ పద్ధతులను చర్చించదలచాను.

1950 ప్రాంతంలోనే నినాద ప్రాయంగా రాస్తున్నారని, కవిత్వం పేరుతో సిద్ధాంతాలను చెబుతున్నారని అభ్యుదయ కవుల మీద విమర్శ వచ్చింది. ఆ విమర్శల నేపథ్యంలో తాను ఏది రాసినా ఇది కవిత్వమవునా? కాదా? అని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవటం శివసాగర్‌కు అలవాటయింది. అ తర్వాత విదేశీ కవులనూ అధ్యయనం

చేయటం వలన కవిత్వశిల్పానికి సంబంధించిన ఆయన అవగాహన విస్తృతమయింది; మరింత చైతన్యవంతుణ్ణి చేసింది. అందుకే ఆ తర్వాత వస్తువుకు తగిన రూపమూ, శిల్పమూ స్ఫురించే వరకు అన్వేషణ కొనసాగించాడని, వేచి ఉన్నాడని కొన్ని రచనలకు ఆయన ఇచ్చిన వివరణలే తెలుపుతున్నాయి.

ఒక వస్తువుని ఒక రూపంలో చెబితేనే అందం వస్తుంది. నేను ఎమోషన్‌తో రాస్తాను. ఎమోషన్ వస్తువుకో రూపాన్ని నిర్ణయిస్తుందేమో! అన్నారు శివసాగర్ ఓ ఇంటర్వ్యూలో.

సాహితీ మిత్రులెవరూ అందుబాటులో లేనప్పుడు తాను రాసిన 'చెల్లీ చెంద్రమ్మా!' గేయాన్ని ఇద్దరు గిరిజనులకు వినిపించారు. వారికి ఆనందం కలిగించిన చరణాలు మాత్రమే బాగున్నట్టు నిర్ణయించుకున్నారంటే వ్యక్తీకరణ పట్ల ఆయన ఎంత శ్రద్ధ వహించేవారో తెలుస్తుంది. ఆయన కవిత్వంలో 'గుణాలు' ఏవీ అప్రయత్నంగా వచ్చిచేరినవికాదు.

ఈ సంకలనంలోని 80 ఖండికలలో వున్నవి నలభై పాటలే. వీటిలో కొన్ని గేయ సదృశమైనవీ ఉన్నాయి. బాల్యంలో అమ్మమ్మపాడి వినిపించిన పాటలు ఆయన మనస్సు మీద బలమైన ముద్ర వేశాయి. 1952 ప్రాంతంలో ఇతర మిత్రులతో కలిసి గుడివాడలో 'కార్మిక కళాక్షేత్రం' అనే ఒక చిన్న సంస్థను ఏర్పాటు చేశారు. "ఎన్నటికైనా విముక్తి ఉందా, ఏదైనా ఒక దారుందా", "ఓరి మోసాల మీసాల మొండి నాగన్నా, దిగు దిగు నాగన్న దిగరా నాగన్న" మొదలైన గేయాలు రాశారు. (చూడు : ఈ వ్యాసరచయిత శివసాగర్‌తో చేసిన ఇంటర్వ్యూ : 'వార్త' ఆదివారం అనుబంధం 31-10-2004 సంచికలో ప్రచురితం) ఇది పాటల నేపథ్యం.

సమాన మాత్రలు కలిగిన పదాల కూర్పు వలన వచన కవితల్లో అక్కడక్కడ అస్పష్టమైన లయ కనిపిస్తుంది. 'ప్రజల నుంచి ప్రజల వద్దకు' అనే సిద్ధాంతానికనుగుణంగా బహుళ ప్రచారం పొందిన జానపద బాణీలను విప్లవ ప్రబోధానికి వినియోగించుకోవటం విశేషం.

జానపద బాణీలను స్వీకరించటం వలన పాద నిర్మాణంలో, వర్ణనల్లో పడికట్టు పద్ధతి లాంటి ఆశుసాహిత్య లక్షణాలు కూడ శివసాగర్ పాటల్లో వచ్చిచేరాయి. ఒకే పదంలో వివిధ పాదాలు ఆరభం కావటం లేదా వివిధ పాదాలు ఒకే పదంతో ముగియటం, ముక్తపదగ్రస్తాలు, విశ్రాంతిస్థానం వద్ద పాదం విరగడం, ఏ పాదానికాపాదంలో భావం పూర్తికావడం మొదలైన ఆశు సాహిత్య లక్షణాలను 'నరుడో భాస్కరుడో', 'చెల్లీ చెంద్రమ్మా', ఓ విలుకాడ, నేలతల్లి చెర విడిపించగ మొదలైన పాటల్లో గమనించవచ్చు.

విరామస్థానాల్లో ఆద్యక్షర మైత్రి కలిగిన పదాలను ప్రయోగించడం, ధ్వని సామ్యం కలిగిన పదాలతో ప్రతి పాదాన్ని ప్రారంభించడం, పునరుక్తి ద్వారా నిర్దిష్ట మానసిక స్థితిని కలిగించడం, సాధారణ జన వ్యవహారంలోని జంట పదాలను వాడడం, సరళ పదాల కూర్పు, లోతైన విషయాలను తేలికమాటలలో చెప్పడం మొదలైన ఆయన పాటలు బహుళ జనాదరణ పొందడానికి కొన్ని కారణాలని ఊహించవచ్చు. కవితా సామగ్రిలోని నూతనత్వం, అన్యాపదేశ పద్ధతి పఠితలను ఆకర్షిస్తాయి.

'మనము', 'మనకు' లాంటి పదాలు ప్రయోగించడం వలన పఠిత (శ్రోత) కవితో మమేకమవుతాడు. దృశ్యాత్మక భావ చిత్రాల (Visual Images) వలన పఠిత మనోనేత్రం ముందు పాట దృశ్యంగా పరచుకుంటుంది. పాట ఎక్కువ కాలం గుర్తుండడానికి ఇది దోహం చేస్తుంది.

మార్క్సిస్టు పరిభాష, పౌరాణిక ప్రతీకలు (ఎక్కువగా) లేకపోవడం ఈయన పాటల్లోని మరో సుగుణం. ఉరికంబంమీద నిలిచి ఊహగానం చేసెద", "ఉరికంబం మీద నిలిచి, తియ్యని కలలే గాంచెద", "ఉరికంబంమీద నిలిచి ఉజ్జ్వల గీతిక పాడెద" (ఉరిపాట పుట. 61) అంటూ పల్లవిని స్వల్పమార్పులతో పునారావృత్తం చేసి ఆసక్తిని కలిగించడం ఈయన అనుసరించే మరోపద్ధతి.

ఏ ప్రాంత ప్రజల బాణీని తీసికొన్నప్పుడు ఆ ప్రాంత ప్రజల భాషలోనే పాటరాశారు. 'నరుడో భాస్కరుడో', చెల్లీ చెంద్రమ్మా', 'గంగదాటెళ్ళకే చెల్లెమ్మా', 'పల్లెటూరి పేదరైతా', 'ఓ విలుకాడ', 'ఏటికి ఎదురీదు వాళ్ళమురా' మొదలైన గేయాల్లోని భాషాపరమైన వైవిధ్యానికదే కారణం. ఆయన జ్ఞాతంగానూ, అజ్ఞాతంగానూ తెలంగాణాలోనే ఎక్కువకాలం ఉండడం వల్లనేమో ఎక్కువ గేయాలు తెలంగాణా భాషలోనే ఉన్నాయి. రుతు సంగీతం, ఖైదీగీతం మొదలైనవి లిఖిత భాషలో ఉన్నగేయాలు. ఇది గురజాడ, నవ్య సాహిత్య పరిషత్తు కవుల ప్రభావమని భావించవచ్చు.

విరసానికి, విప్లవ సాహిత్యోద్యమానికి పాటల ఒరవడి పెట్టింది 'నరుడో భాస్కరుడో' పాట. విప్లవ చైతన్య వ్యాప్తిలో పాటలకున్న ప్రాధాన్యాన్ని ఈ పాట తెలియజెప్పింది అన్నమాట వాస్తవం. కొన్ని గేయాలు లిఖిత భాషలో, మరికొన్ని గేయాలు- చేసెద, పాడెద, వీక్షింతును లాంటి గ్రాంథిక భాషా రూపాలతో కూడిన మిశ్రమశైలిలో ఉన్నాయి. శివసాగర్ గారి పాటలను పాడడంలో ఎదురైన అనుభవాలను వివరిస్తూ గద్దర్ "ఈ పాటలన్నీ పద్యాల ఫక్కీలో, Classical touch తో ఉండేవి. ఈ బాణీలను పట్టుకోవడం కష్టం. ఒక వేల పట్టుకొన్నా వాటికి న్యాయం చేకూర్చలేకపోయాం... పాటకు కట్టిన బాణీ అటు Folk కాక, Classical కాక, General కాక, దానిని గుర్తుపెట్టుకోవడం కష్టంగా ఉండేది" అన్నారు. (చూడు : "పాటలు-ఆటుపోట్లు" 1995. జె.ఎన్.యమ్. ప్రచురణలు)

"లిఖిత శైలి గేయమే వెంపటాపు, పాణిగ్రాహి కవితా ప్రక్రియ. పాటలు రాసిన ఉద్యమ కార్యకర్తలపై ఈ ఇద్దరి రచనల ప్రభావం కారణంగా కూడా లిఖితశైలి గేయమే ఈ ఉద్యమంలో ముఖ్యస్థానం ఆక్రమించింది. ఏజెన్సీ ఉద్యమ కవి సోములు, మైదాన ఉద్యమ కవి కొర్రాయ గణపతులు మౌఖికమైన పాటకు సన్నిహితంగా ప్రక్రియను మలచారు. పాణిగ్రాహి, వెంపటాపు రచనల్లోని లిఖితశైలి గేయ ప్రక్రియ అభివృద్ధి దశ నుండి క్రమంగా మౌఖికమైన పాట దిశగా పరిణామం సాగింది...

లిఖిత, వ్యవహార మిశ్రమ శైలీ, భాషల్లో పాణిగ్రాహి, వెంపటాపు పాటలు రాశారు. ఈ ఉద్యమానికి పూర్వరంగంగా వున్న, ఉద్యమ కవులు పాడిన అభ్యుదయ కవుల తెలంగాణా విమోచనోద్యమాన్ని కీర్తించిన పాటలు మధ్య తరగతికి చెందిన ఉద్యమ కవుల అభివ్యక్తిపై ప్రభావం వేయడమే ఈ పాటల్లోని లిఖిత శైలికి ముఖ్య కారణం" అంటారు డా॥ కె. ముత్యం అనే పరిశోధకుడు. (శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం. 1993. దృష్టి ప్రచురణ. పు. 177, 178) ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసికొని పరిశీలిస్తే శివసాగర్ పాటలలోని శైలికి మూలకారణాలు మరింత స్పష్టమవుతాయి.

జానపద గీతాల్లో అన్యాపదేశంగా, నర్మగర్భంగా చెప్పేపద్ధతిని పట్టుకుని దానిని విప్లవ ప్రబోధానికి అనుగుణంగా మలచుకొని కొత్త ఒరవడి సృష్టించారు. కొక్కొరోకో, ఏటికి ఎదురీదు వాళ్లమురా లాంటి గేయాలు ఇందుకు నిదర్శనాలు.

సద్దాంకు ప్రేమలేఖ, నేను మొదలైన వచన కవితల్లోని తొలిపాదాలు పల్లవిలాగా అర్థవంతంగా పునరావృత్తం కావడాన్ని చూస్తే పాట ఈయన మనోధర్మానికెంత సన్నిహితమైనదో తెలుస్తుంది.

* * *

వచన కవిత్వానికి నిర్దిష్టమైన నిర్మాణ చట్రం లేకపోవడం సౌకర్యమూ, అసౌకర్యమూ "Writing free verse is like playing tennis with the net down" అంటాడు. రాబర్ట్ ఫ్రాస్ట్. నెట్‌ను తొలగించి టెన్నిస్ ఆడేటప్పుడు ఆ నెట్ ఉండే ఎత్తును దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. అలాగే వచన కవిత్వానికి నియమాలు లేకపోవడం అంటే ఐచ్ఛికంగా నియమాలనో, నిర్మాణ సూత్రాలనో ఏర్పరచుకునే అవకాశముండటంగా అర్థం చేసుకోవాలి. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసికొన్న వారే మంచి వచన కవితలు రాయగలిగారు. కవితా సామాగ్రిలో నూతనత్వంతో పాటు, నిర్మాణంలో, గమనంలో వైవిధ్యాన్ని చూపటం కవి సామర్థ్యానికి గీటురాయి.

ఈ రకమైన వైవిధ్యం కోసం, నూతనత్వం కోసం అన్వేషణను శివసాగర్ ప్రతికవితలోను చూస్తాం. ఈయన రాసిన ఏ రెండు కవితలూ ఒకే నిర్మాణ చట్రంలో ఉండవు. శీర్షిక నామకరణంలో, ఎత్తుగడలో, నిర్వహణలో, ముగింపులో కొత్తదనం కోసం ఈయనపడే తాపత్రయాన్ని ఇటీవలి కవితలోను గమనించగలం. ఈయన కవిత్వం నుండి యువ కవులు నేర్చుకోదగిన ప్రధానాంశమిది.

కవిత్వీకరణలో ఈయన అనుసరించే పద్ధతులలో ప్రధానమైనది ప్రతీకాత్మకత. వాచ్యార్థం పొసగని వాక్యాల ద్వారా ప్రతీకాత్మకతను సూచించడం 'అలలు' కవితలోని విశేషం. 'కడలిజనం, అలలు దళం' అంటూ కవి తానే విప్పి చెబుతాడు. ప్రజలకు, ఉద్యమ కార్యకర్తలకు ఉన్న జన్య జనక సంబంధాన్ని సూచిస్తాడు. 'అలలు సముద్రం చేతి కత్తి, అలలు సముద్రం చేతి కలం' అనే వాక్యాల ద్వారా సామాజిక, సాంస్కృతిక పరిణామాలలో యోధుల విశిష్టపాత్రను తెలుపుతాడు.

'కొక్కొరకో' అనే మరో కవిత చూడండి.

"ఈనీన వరిచేను పాలుబోసింది
పాలుబోసిన చేను అర్రువంచింది"

అంటూ పాలు పోసుకున్న గింజలు గట్టిపడి పంట చేతికొచ్చే సమయమైందని ముందు అంటాడు. ఆ తర్వాత ఏతమెత్తి దుక్కి దున్ని నారు నీరు పోసి కలుపు తీయడమనే పంటకు పూర్వ కృషిని గుర్తు చేస్తాడు. ఆ పని చేసిన రైతును సంబోధిస్తూ 'కక్కు కొట్టాలిరా కొడవళ్ళు' అంటూ సమీప భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్దేశిస్తాడు. "కోతకొచ్చిన చేను కోరి పిలిచింది" - కుక్కు కొట్టండిరా కొడవళ్ళకు, పదును పెట్టండిరా కొడవళ్ళకు" అంటూ తక్షణ కర్తవ్యాన్ని గుర్తు చేస్తాడు.

ఒక అంశాన్ని కీలకమైన దశల్లో పునరుక్తం చేయడం ద్వారా దానిని ప్రతీకగా స్ఫురింప జేయడం ప్రతీకాత్మకతలో ఒక పద్ధతి. నిదురపోయే సీమ కదల బారటం, వరిచేను ఈనటం, కోత అనే ప్రతీకల ద్వారా పదునెక్కిన ఉద్యమాన్ని, శత్రునిర్మూలనను వ్యంగ్యం చేస్తాడు. ముక్త పదగ్రస్తాన్ని ద్రుత గతిని సాధించడానికి పాఠకుని (శ్రోత యొక్క) ఏకాగ్రతను నిలిపి ఉంచడానికి ఉపయోగించుకున్నాడు.

"తూరుపు కొండంత జేవురించింది

నీలాటి రేవంత నిగ్గుదేరింది

పాతాళ గంగమ్మ పెల్లుబికి పొంగింది"

వసంత కాలమేఘ గర్జనను గుర్తు చేస్తూ, ప్రజలలోని అంతర్గతమైన చైతన్యం పెల్లుబికిందంటాడు. 'కొక్కొరోకో' అనే శీర్షిక ద్వారా సూర్యోదయాన్ని సూచించి తద్వారా శత్రునిర్మూలనకు సమయం ఆసన్నమైందని అంటాడు.

కవితల ముగింపులు కూడా ప్రత్యేకంగా పేర్కొనదగినవి. "ఓల్గా ఘనీభవించెను, యాంగ్సీనది పొంగెను" అనే వాక్యాలతో ప్రారంభమవుతోంది 'రుతు సంగీతం' అనే ఖండిక. ఇక్కడ ఓల్గా రష్యాకు, యాంగ్సీ చైనాకు సంకేతాలన్న విషయం ప్రసిద్ధమే. మింకాంగ్, సైబీరియా, ఉస్సూరి, క్రెమ్లిన్, తీన్‌మీన్ అనేవి ఈ కవితలోని ఇతర ప్రతీకలు. ఇక్కడ ప్రతీకలన్నీ నామవాచకాలే. ప్రతీకాత్మకతలోని ఏకరూపత ఈ కవితలోని శిల్పవిశేషం. కాగా "రుతు గీతికి పరవశించి గంగ కూడ పొంగెను" అంటూ విప్లవ రుతువు భారత దేశంలోను వ్యాపిస్తున్నదని తెలపటం ఈ కవిత ముగింపు. 'రెడ్ సిగ్నల్' అనే కవిత "ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ ఎంతో కాలం బతకడు" అనే విరోధాభాసతో ముగుస్తుంది.

'ఆకాశంలో సగంనీవు' అనే మాటలతో ప్రారంభమవుతుంది మరోకవిత. 'ఆకాశం' అనే ప్రతీకను చివరి వాక్యంలో 'విప్లవాకాశం' అంటూ రూపకంగా మారుస్తాడు. సామాన్యాంశ ప్రతిపాదనకు వినియోగించిన ప్రతీకనే విశేషాంశ బోధనకూ ఉపయోగించడం ఇక్కడ కవి అనుసరించిన టెక్నిక్. ఆ తర్వాత ఈ పద్ధతిని విప్లవ కవులు ఎక్కువగా అనుసరించారు.

ఒక ఇంటర్వ్యూలో "దళిత కవినని మీరు చెప్పకోవడంలో అర్థమేమిటి?" అని అడిగితే శివసాగర్ "దళితుడిగానే విప్లవం కోసం రియాక్ట్ అవుతున్నారు. దళిత కవిత్వం వచ్చినప్పడు మూడు నాలుగేళ్ళు నేను దళిత కవిత్వం రాయలేదు. నా దళిత కవిత్వం "నడుస్తున్న చరిత్ర"తో ప్రారంభమైంది. కొందరు దళిత సాహిత్య కారులు నేను వర్గదృష్టి నుంచీ బయటపడలేదన్నారు. మీరు కులదృష్టినుంచీ బయటపడలేదుకదా అంటాను నేను.అంబేద్కర్ వర్గ, కుల సమాజమన్నాడు. విప్లవ, స్త్రీ, దళిత వాదాలు సమాజం నుంచీ వచ్చినదే గదా! వీటి మధ్య ఇంటర్ రిలేషన్ ఏమిటి? సిద్ధాంతపరంగా అర్థమైంది, కవిత్వంలో ఎలా చెప్పాలనే సమస్య ఎదురైంది. 'నల్లాటి సూరీడు'లో సాధ్యమైంది. "సెమటసుక్క స్వర్ణమ్మతో, చెలిమి చేసే సూరీడు". స్వర్ణమ్మ నల్లగొండకు సంబంధించిన మాదిగ గెరిల్లా. ఆ అమ్మాయి బి.ఏ. చదివింది. "చంద్రవంక ఏసన్నకు మనసిచ్చిన సూరీడు"- కారంచేడు దురంతానికి పథకం రూపొందించిన వాడిని చంపింది ఈ ఏసన్నే! "సిక్కోలు కొండల్లో సీమల బారు సూరీడు"-అది మూడు వాదాల మధ్య ఉన్న ఇంటర్ రిలేషన్. నువ్వెవరివంటే దళిత విప్లవ కవినే గాదు, విప్లవదళిత కవినని కూడా చెప్పాను. ఒకటి మరొకదానికి కొంత వివరణనిస్తుంది" అంటూ వివరించారు.

'నడుస్తున్న చరిత్ర' విభాగంలో అదే పేరుతో గల కవిత చూడండి.

"శంబూకుడు పెదాల మీద చిరునవ్వుతో

రాముణ్ణి వధిస్తున్నాడు

ఏకలవ్యుడు ద్రోణుని బొటన వేలును

గొడ్డలితో నరుకుతున్నాడు

బలి తన చిరు పాదాలతో వామనుణ్ణి

పాతాళానికి తొక్కేస్తున్నాడు" (పుట. 263)

తరతరాల నుంచి దళితులను అణచివేయడానికి అనుసరింపబడిన వ్యూహాలను ప్రశ్నిస్తూ, దళితులు తిరుగుబాటుకు సిద్ధమైనారని చెప్పడానికి పాత్రల వ్యత్యయం (Reversal of Roles) అనే పద్ధతిని కవి ఎంతో చక్కగా వాడుకున్నాడు. అదలా ఉంచితే "ఓహో! ఇప్పుడు నడుస్తున్న చరిత్ర పరమ ఛండాల చరిత్ర" అనేది ఈ కవిత ముగింపు. ఇక్కడ 'చండాల చరిత్ర' అనే సమాసం యౌగికార్థంలోనే సార్థకం. కాని కుల తత్త్వ వాదుల వ్యావహారిక భాషలో ఆ పదానికున్న 'నీచమ' నే రూఢ్యర్థాన్ని స్ఫురింప జేయడం నిరసన తెలపడానికే. ఇందులో దళితులలో పెరిగిన చైతన్యాన్ని సూచిస్తూ హెచ్చరించడమూ ఉంది. ఈ కవితను చదివిన వారెవరూ ఈ ముగింపును మరచిపోలేరు. ఇలాంటివన్నీ కేవలం కొసమెరుపులు కావు. చెప్పదలచిన కీలకాంశాలు నిక్షిప్తం చేయబడిన రహస్యస్థావరాలు.

"నా నెత్తురు కోనేరులో నవలోకం వికసించును

నా మృత్యువు సన్నిధిలో జీవ రవళి వినిపించును"

మొదటి పాదంలో క్రియద్వారా 'పుష్పం' అనే ఉపమానాన్ని (లుప్తోపమ) తెలుపుతాడు. రెండో పాదంలోని 'జీవరవళి' నూతన సమాజానికి సంకేతంగా భావించవచ్చు. ఉత్తేజకరమైన భావాలను లలితమైన పదాలతో వ్యక్తపరచడం ఇక్కడి సౌందర్యం. ఇలాంటి విరుద్ధాంశాల సమ్మేళనం చాల కవితలలో చూడవచ్చు.

* * *

భావ కవిత్వం పట్ల వ్యతిరేకత కారణంగా ప్రేమ కవిత్వాన్ని ద్వేషించడం, వసంతం, పువ్వులు, వెన్నెల లాంటి పదాలను కూడా నిరసించడం, పద లాలిత్యాన్ని నిరసించడం అభ్యుదయ కవిత్వం నాటి నుండి ఆనవాయితీగా మారింది. సూర్యుడు, అగ్ని, రక్తం, ప్రభంజనంలాంటి ఉద్రేక స్ఫోరకమైన అంశాలనే తప్ప మార్దవమైన సౌందర్య వ్యంజకమైన పదాలను ప్రతీకలను ఉపయోగించకూడదనే అపోహను శివసాగర్ తొలగించారు. ఉర్దూలో విప్రలంభశృంగార వర్ణనల్లో ప్రతీకలుగా స్వీకరింపబడిన అంశాలనే అభ్యుదయ కవులు ప్రగతిశీల భావాలకూ ప్రతీకలుగా స్వీకరించారు. వివిధ దేశాల విప్లవ కవుల కవిత్వంలోనూ ఈ ధోరణిని గమనించగలం.

శివసాగర్ ఉద్యమాన్ని సూర్యునితో కాకుండా 'నెల బాలుని'తో పోల్చడమే గొప్ప పరిణామం. అలలు, నా కోసం ఎదురు చూడు, అమ్మో, సూర్యుడు మొదలైన కవితలలోని సున్నితమైన అనుభూతులు, అందమైన పద చిత్రాలు, భావ సౌకుమార్యం విప్లవ కవిత్వానికి సౌందర్య పార్శ్వాన్ని జత చేశాయి. ఇక్కడే మరో అంశం కూడ చెప్పకోవాలి. 'బయటి' కవులెవరైనా, ఎప్పుడైనా కవిత్వంలో సిద్ధాంతాలను చెప్పారేమో, నినాదప్రాయంగా రాశారేమో? కాని గెరిల్లా కవులెవరూ అలాంటి కవిత్వం రాయలేదని చెప్పాలి. ఉద్వేగగాఢత, అనుభూతి సాంద్రత, నిసర్గసౌందర్యం, పదలాలిత్యం, ధ్వని ప్రాధాన్యం గెరిల్లా కవుల కవిత్వంలో సాధారణ లక్షణాలుగా కనిపిస్తాయి. నిశితంగా పరిశీలిస్తే మరిన్ని ఆసక్తికరమైన అంశాలు తెలిసే అవకాశముంటుంది.

జీవితపు మలిసగంలో వయసుపైబడుతున్న కొద్దీ శారీరక రుగ్మతలతో పాటు 'దేహచింత', మృత్యు స్పృహ పెరుగుతూ ఉండడం సర్వసాధారణం. అనివార్యమైన మృత్యువును అంగీకరించలేని సగటు మనిషి మనస్తత్వమే కొత్త కొత్త విశ్వాసాలకు దారితీస్తూ ఉంటుంది; ఉన్న విశ్వాసాలను పెంచుతూ ఉంటుంది. అనివార్యం కనుక మృత్యువును ఆనందంగా కాకపోయినా వాస్తవిక దృక్పథంతో స్వీకరిస్తాడు భౌతిక వాది.

"నేను మునిగే పడవలో
హాయిగా నిద్రపోతున్నాను
వల విసిరి
కలల చేపల్ని పట్టుకుంటాను" (పుట. 295)

శరీరం శిథిలమవుతోన్నా, ఉద్వేగోల్లాసాలు వీడని మానసిక స్థితిని చెప్పిన కవిత 'నేను'. మృత్యు ముఖాన్ని సమీపిస్తున్న దేహానికి 'మునిగే పడవ'ను ప్రతీకగా చెప్పటం వలన వ్యక్తమవుతున్న బీభత్సం, విషాదం అనుభవైక వేద్యమే. 'హాయిగా' అనే పదం ద్వారా 'స్థితప్రజ్ఞత' వ్యక్తపరచబడింది.

వృద్ధాప్యం వలన తాను ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోలేకపోయినా మతోన్మాదానికి, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరును సమర్థించడం, "లక్షలాది సైనికుల్లో నేనొక సైనికుణ్ణి" అంటూ తనను ఒక సైనికుడిగా ఊహించుకోవడంలో నిబద్ధత ఉంది. "వల విసిరి కలల చేపల్ని పట్టుకుంటాను" అన్న చోట ఈ కలలు స్వీయ సౌఖ్యకాంక్షను తెలిపేవి కావని, సామ్యవాద స్వప్నాలని పరోక్షంగా చెబుతాడు.

"నేను సమాధి పక్క
నవ్వుతూ కూర్చున్నాను
హృదయ తంత్రుల్ని మీటి
జీవన సరాగాన్ని వినిపిస్తాను"

'హాయిగా' అనే పదానికి 'నవ్వుతూ' అనే పదానికి ఉన్న భావసామ్యం కవి అభిప్రాయాన్ని మరింత స్పష్టంచేస్తుంది. జీవితంలోని విషాదంతో పాటు, మాధుర్యాన్ని మరవకుండానే మృత్యువును పరిహసిస్తాడు. మృత్యుభీతిని, నైరాశ్యాన్ని కాకుండా ఆశావహ దృక్పథాన్ని ప్రదర్శిస్తాడు. ఏ అనువాదకుని దృష్టికైనా వచ్చిందో లేదో కాని సంభాషణలోనైనా రాణించే కవిత ఇది.

ప్రేరణలను, రచనల సమయ సందర్భాలను, వ్యక్తిగత ప్రతీకల సార్థకతను తెలుపుతూ చేర్చబడిన వివరణలను ఆయా రచనలను బాగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. ఈ వివరణలలో కవి చూపిన నిజాయితీ కూడా ప్రశంసార్హమైనది. "ఏటికి ఎదురీదు వాళ్ళమురా" అనే గేయంలో 'జాలరన్న' పార్టీ నాయకత్వానికి, 'మొనగాడు తమ్ముడు' వెంపటాపుసత్యానికి 'ఎదిగిన అమ్మణ్ణి' పంచాది నిర్మలకు (ఇత్యాదిగా) సంకేతాలంటూ కవి స్వయంగా చెప్పటం అనవసరమేమో? ఇలా చేయటం పాఠకుల ఊహాశాలితకు కళ్ళాలు బిగించడమే; అనేకార్థ బోధకతకు భంగం కలిగించడమే. "ఒక స్త్రీ తన మొదటి రాత్రి అనుభవాన్ని గూర్చి పర పురుషునితో మాట్లాడనట్లే కొన్ని వ్యక్తిగతమైన, రహస్యమైన సున్నితమైన అంశాలను బహిరంగంగా చర్చించడం మంచిది కాదు; అనవసరం కూడా. అలాంటి వాటిల్లో ఒకటి సృజనాత్మక వ్యవహారం. రచయిత తన రచనను గూర్చి ఏదైనా చెప్పినప్పటికీ ఇంకా

చెప్పబడినది ఎంతో మిగిలే ఉంటుంది" అంటాడు అలెక్సీ టాల్‌స్టాయ్ అనే రచయిత, విమర్శకుడు. నిజానికిది చర్చనీయాంశమే అయినా దీనిని ఒక అభిప్రాయంగా పరిగణలోకి తీసికొని ఆలోచించాలి.

ఇందిరిస్టుగారడీ, శ్రీశ్రీ జ్ఞాపకాలు, నెలవంక మొదలైన కవిత్వంలోని అధిక్షేప, అధివాస్తవిక ధోరణులు శ్రీశ్రీ కవిత్వాన్ని గుర్తుచేస్తాయి. నా కోసం ఎదురు చూడు, పదివసంతాలు మొదలైన కవితలలోని భావ సౌకుమార్యం, వ్యగ్యం లయాత్మక విన్యాసం తిలక్‌ను గుర్తుచేస్తాయి. మానవ స్వభావాన్ని తెలిపే నైరుప్యాంశాలకు సారూప్యాంశాలలో అభేదాన్ని చెప్పడంలో, వ్యంగ్యం, అవహేళనల్లో, మృదువైన కటువైన పదాలను వెంట వెంట ప్రయోగించడం గ్రాంథిక, వ్యావహారిక మిశ్ర భాషశైలి, ఇంగ్లీషు పదాలను ధారాళంగా ఉపయోగించడం మొదలైన అంశాలలో శివసాగర్ కవిత్వానికి పోలికలు కనిపిస్తాయి. శివసాగర్ తిలక్‌ను బాగా అభిమానిస్తారన్న విషయాన్ని గమనిస్తే ఈ పోలికలు యాదృచ్ఛికం కావని అనుకోవచ్చు.

రివిజనిజాన్ని నిరసించటం, తీవ్రంగా ఖండించటం ఈయన కవిత్వంలోని మరో ప్రధానాంశం. లెనిన్ నా లెనిన్, మైక్రోస్కోపిక్, రుతు సంగీతం ఇలాంటి కవితలు. "నక్సల్బరీ శ్రీకాకుళ విప్లవోద్యమంలో రివిజనిజంతో పోరాటం కూడా ఒక భాగమయింది. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని విరమించడానికి కమ్యూనిస్టు పార్టీలో ప్రవేశించిన రివిజనిజమే కారణం. రివిజనిజం చీడపురుగులాగ పార్టీలోని సిద్ధాంత బలాన్ని తొలిచివేస్తుంది. కార్మిక వర్గంలోకి అన్యవర్గ భావజాలం ప్రవేశించడం వలన ఈ రివిజనిజం తలెత్తుతుంది. అప్పుడది రంగు మార్చకుండా దిక్కు మారుస్తుంది. అది తెలంగాణా పోరాటానికి ఎంతటి నష్టాన్ని కల్గించిందో, సామాజిక ఉద్యమాల మీద దాని ప్రభావం ఎటువంటిదో. 1950లలో రష్యా కేంద్రంగా అంతర్జాతీయంగా వ్యాపించిన రివిజనిజం ఫలితాలు ఏమిటో ఇదివరకే చెప్పడం జరిగింది. కాబట్టి నక్సల్సరీ విప్లవోద్యమం అనేక సైద్ధాంతిక పోరాటాలతో పాటు రివిజనిజంతో కూడ పోరాటం చేసింది. రివిజనిజం క్యాన్సర్ వలె వ్యాపించి యున్నప్పుడు దానితో పోరాటం చేయకుండా విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం కష్టం. కాబట్టి ఈ విప్లవోద్యమంలో రివిజనిజంతో పోరాటం చేయడం ఒక ముఖ్యమైన భాగమయింది. విప్లవ కవిత్వంలో మిగిలిన అందరు కవుల కంటే శివసాగరే ఎక్కువగా రివిజనిజంతో పోరాడుతూ కవిత్వం రాసారు" అన్నారు డా. యం. గంగాధర్ అనే పరిశోధకుడు. (ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవధోరణులు - ఒక విశ్లేషణ" -పుట. 265).

"ప్రజలను సాయుధం చేస్తున్న రివల్యూషనరీ నేడు కవి" అనే వాక్యానికి వచ్చిన ప్రచారం దానికంటే ముందుదైన "స్వార్థం శిరస్సును గండ్రగొడ్డలితో నరక గల్గిన వాడే నేటి హీరో" అనే వాక్యానికి రాలేదని శివసాగర్ అన్నారు.

(1970లో రాసిన కవిత్వంలో శివసాగర్ "ప్రజలను సాయుధం చేస్తున్న రివల్యూషనరీ నేడు కవి" అని అన్నారు. యిప్పుడు గూడా తానీ మాటకు కట్టుబడి వున్నారా అని ఒక ఇంటర్వ్యూలో అడిగినప్పుడు ఆయన "ఏ విశిష్ట కవితా చరణమైనా ప్రతి యుగంలోనూ, ప్రతి సందర్భంలోనూ కొత్త అర్థాన్నీ, నిర్దిష్టతనీ సంతరించుకుంటుంది. సాయుధులను చెయ్యటమన్నప్పుడు ఆయుధం కేవలం భౌతికమైన మారణాయుధమే కానక్కరలేదు. ప్రజల్ని ఇప్పటికీ ఐడియలాజికల్‌గా, సాంస్కృతికంగా, రాజకీయంగా సాయుధం చేయాలి. ఒక నూతన సమాజాన్ని రూపొందించే నూతన మానవుణ్ణి సృష్టించాలి. ఇది ఒక అనంతయాత్ర. ఆ దిశగా ప్రయాణించడం కవికి అనివార్యం. అలాగే ఆ కవితలో ఆ వాక్యానికి ముందున్న వాక్యాన్నీ తీసుకోవాలి. "స్వార్థం శిరస్సు గండ్రగొడ్డలితో నరక గల్గిన వాడే నేటి

హీరో". దానికి ప్రాధాన్యం రాలేదు. రివిజనిజమ్ ఈజ్ సెల్ఫ్, స్వార్థం శిరస్సును నరకగల్గినవాడే న్యూమాన్. ఈ నూతన మానవుడే నూతన సమాజాన్ని సృష్టిస్తాడు. "ప్రజల గుండెల కొండల్లో మాటువేసి, ట్రిగ్గర్ నొక్కగల్గిన వాడే ద్రష్ట", ప్రజలను ఎడ్యుకేట్ చేయాలి. ఎన్‌లైటన్ చేయాలి". అంటూ సమాధానం చెప్పారు.)

"స్వార్థంతో పోరాటం చేయడం ద్వారా రివిజనిజాన్ని నిజంగా ఓడించగల్గుతాం" అనే మావో మాటలను తన జైలు డైరీలో అనేక పర్యాయాలు ప్రస్తావించారు. (చూడు : "శత్రుశిబిరమునైన - శివసాగర్ జైలు డైరీ" 1983 సృజన ప్రచురణ)

విప్లవ చైతన్యానికి సంబంధించిన శ్రీశ్రీ అందరికీ స్ఫూర్తినిచ్చాడు. తొలిమలితరం విప్లవ కవుల మీద వస్తు, రూపాలకు సంబంధించి శ్రీశ్రీ ప్రభావం లేదనే చెప్పాలి. మావోయిస్టుగా సాయుధ పోరాట మార్గాన్ని బలంగా కవిత్వీకరించిన తొలికవి శివసాగర్. వస్తు, రూప, వ్యక్తీకరణల పరంగా తొలిమలితరం విప్లవ కవులకు మార్గదర్శకుడు శివసాగర్. విప్లవ కవుల మీద శ్రీశ్రీది పరోక్షప్రభావం కాగా శివసగార్‌ది ప్రత్యక్షప్రభావం. వరవరరావు, శివారెడ్డి, ఎన్.కె.మొదలైన కవులపైన శివసాగర్ ప్రభావాన్ని గూర్చి డా.కె. రామదాసు అనే పరిశోధకుడు సహేతుకంగా చర్చించారు. (చూడు : "ఉద్యమం నెల బాలుడు - ఒక పరిశీలన" -1993 జాహ్నవి ప్రచురణలు)

ప్రజలను చైతన్య పరచటం, ఎత్తుగడలు, వ్యూహాలు, మిత్రద్రోహాలు, నిర్బంధాలు, కన్నీటి అద్దంలోనే ఆత్మీయతాను బంధాలను దర్శించడాలు, ప్రాణత్యాగాలు మొదలైవన్నీ సాయుధ పోరాటంలోనూ సహజమైన అంశాలు. ఇవీ, వీటికి అనుబంధితాంశాలే శివసాగర్ కవితా వస్తువులు. విప్లవ రాజకీయాలకు సంబంధించి ఇప్పుడు ఆయన అభిప్రాయాలేవైనా సాయుధపోరాటం కొనసాగినంత కాలం ఆయన కవిత్వానికి ప్రాసంగికత ఉంటుంది.

"కవిత్వం నన్ను రక్షించింది. సాహిత్యం నన్ను రక్షించింది. చిన్న వయస్సు నుంచీ రివల్యూషనరీ రచనలు చదివాను. టార్చర్‌ను అనుభవిస్తున్నప్పుడు, ఉరిశిక్ష పడ్డప్పుడు వీరులు ఎలా తట్టుకున్నారు లాంటి విషయాలు నవలలు నాకు తెలిపాయి. ఆ నవలల్లోని హీరోలు నాకు రోల్ మాడల్ అయినారు" అంటారు శివసాగర్.

ఉద్యమానికి సంబంధించి కవికి ఉన్న నిబద్ధత, నిమగ్నతలు వక్తవ్యాంశానికి విశ్వసనీయతను పెంచాయి వస్తుసాన్నిహిత్యం, ప్రత్యక్ష ప్రేరణలు వ్యక్తీకరణకు గాఢతను, ఆప్తతను చేకూర్చి పెట్టాయి. విస్తృత సాహిత్యాధ్యయనం ఆయన కవిత్వానికి లోతును, నిర్వహణ పద్ధతులలో వైవిధ్యాన్ని సమకూర్చింది. సిద్ధాంత నేపథ్యంలో ఆచరణ వీటన్నింటికి పదును పెట్టింది.

ఏ రచన అయినా ఎక్కువకాలం నిలవాలంటే ఏ విషయాన్నయినా స్పెసిఫిక్‌గా చెబుతూనే జనరలైజ్ చేయాలని శివసాగర్ నమ్ముతారు. "గొథేని, నెరుడాని ఇంకా అలాంటి కవులందరినీ మనం ఎందుకు చదవగలుగుతున్నాం? చదివి ఎందుకు ఆస్వాదించగలుగుతున్నాం. వాళ్ళ కవిత్వంలో స్పెసిఫిక్, జనరల్‌గూడా ఉంది. ఏ విషయాన్నయినా స్పెసిఫిక్‌గా చెబుతూనే జనరలైజ్ చేయగలిగితేనే తర్వాతి తరం గూడా చదవగలుగుతున్నది. ప్రేమ ఉందనుకోండి - స్పెసిఫిక్‌గా స్టార్టయి ఎప్పుడూ యూనివర్సల్ అవుతుందిగదా! అందుకే ఇప్పటికే మనం ప్రేమ కవిత్వం, నవలలు చదవగలుగుతున్నాం... ఫిలాసఫీ ఆరిజన్ చదివితేగానీ మార్క్సిస్టు ఫిలాసఫీ అర్థంగాదు" అంటారు శివసాగర్.

"ఇది వరకు ఎంతో కొంత ప్రస్తావించేదే అయినా, ఏదో రకంగా చెప్పిందే అయినా, ఇప్పటికీ సరిగ్గా చెప్పలేకపోతున్నది శివసాగర్ కవిత్వంలోని వైవిధ్యం గురించి. ఈ వైవిధ్యం విప్లవోద్యమంలో ఆయనకున్న తాదాత్మ్యం వల్ల వచ్చింది. వస్తువు, దానికనుగుణమైన రూపం, మూడ్, వాతావరణం, డిక్షన్, ఎంచుకోవడం తెలుగు కవిత్వంలో ఆయనను మించి ఇంకెవ్వరూ చేయలేదు" (చూడు : శివసాగర్ కవిత్వం. పుట. 130) అనే వరవరరావుగారి మాటలు అక్షర సత్యాలు.

సమకాలీన గ్లోబలైజేషన్ నేపథ్యంలో కవుల, రచయితల బాధ్యతేమిటో శివసాగర్‌కు స్పష్టంగా తెలుసు. ఆ గ్లోబలైజేషన్‌ను నేను వ్యతిరేకం గాదు. కానీ మనకు కావలసింది సోషలిస్టు ఆల్టర్నేటివ్ గ్లోబలైజేషన్ .కనుకనే ఇవాళ మన మీద చాలా చాలెంజింగ్ కర్తవ్యం ఉంది. ఇప్పుడు గ్లోబలైజేషన్ వ్యతిరేకపోరాటమంటే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, శాంతి కోసం జరిగే పోరాటం. మల్టీనేషనల్ కంపెనీల దుర్మార్గానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం. ఈ దిశగా సాహిత్య సృజన జరగాలి. గ్లోబలైజేషన్ వెనకవున్న ఆర్థిక రాజకీయ సైనికపరమైన అంశాలను చెప్పాలి. ఒకప్పుడు థర్డ్ ఇంటర్నేషనల్ ఉండేది. సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటాన్ని ఆర్గనైజ్ చేసింది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత అది రద్దయింది. ఇప్పుడు ప్రతిస్థాయిలోనూ గ్లోబలైజేషన్ వ్యతిరేక పోరాటం జరగాలి. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న దేశాలకు మద్దతు పలకాలి. మానవాళి భవిష్యత్తు మీద దాడి జరుగుతున్నప్పుడు, దళితులైనా, స్త్రీలైనా, ముస్లిములైనా ఎవరైనా ఒక్కటిగా ప్రతిఘటించాలి. సాహిత్యం అందుకు తోడ్పడాలి" అని చెప్పే శివసాగర్ కవిత్వం, ఆయన అభిప్రాయాలను ఎలా సాహిత్యీకరించడమో స్పష్టంగా చూపెడుతుంది.

✸ ఈ వ్యాసంలో పేర్కొన్న శివసాగర్ అభిప్రాయాలు "నేనొక ట్రాజిక్ హీరోను" అనే శీర్షిక కింద ఆదివారం వార్త 31, అక్టోబర్ 2004 లో వెలువడిన ఇంటర్వ్యూలోంచి తీసుకొనబడ్డాయి. ఇంటర్వ్యూ చేసినవారు : పెన్నా శివరామకృష్ణ.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం తాడికొండ శివకుమార శర్మ గారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.